# అమ్మ పాదాలు

అమ్మ పక్కన పడుకున్న కరుణకి మెలకువ వచ్చింది. చుట్టూ చీకటి. అమ్మని వెతుకుతున్నాడు. లేవబోయి కిటికీనుంచి బయటికి చూశాడు. ఏమీ కన్పించలేదు. ఒత్తి చీకటే. కొళాయి కన్పట్టం లేదు. పూల మొక్కలూ కన్పట్టం లేదు. కిటికీ ప్రక్కగా ఇంటిమీదికి ప్రాకిన చెమేలి గుబురులత కూడా కన్పించలేదాయే. కనిపిస్తున్నదల్లా ఒక్క అమ్మే. అదీనూ చేతులకి.

'అమ్మా' అని తన చిన్న చేతులతో అమ్మ ముఖాన్ని తట్టి, తనవేపు తిప్పి నిద్ర లేపాలని ప్రయత్నించాడు కరుణ.

అమ్మ పలికింది.

'అమ్మా, అమ్మా' అని కరుణ నిద్రలేచిన గొంతు.

'ఏం' అం దీసారి పలికి పార్వతమ్మ.

'అమ్మా, రేపు కాశీం అన్నయ్య పంపించాడే, ఆ పార్శిల్ - పోస్ట్‌మేన్ ఇస్తాడా?' కరుణకి బలే సందేహంగా ఉంది. కాశీం అన్నయ్య సెలవలమీద కాశ్మీర్ నుండి వచ్చినపుడు తన పుట్టినరోజు పండుగవరకు ఉంటాడను కొన్నాడు. కాని కాశీం అన్నయ్య నెలదినాల ముందే వెళ్లిపోయాడు. తంతి అందింది. అత్యవసర పరిస్థితులని.

తెల్లారితే కరుణ తొమ్మిదో పుట్టినరోజు. పుట్టినరోజు పండుగ కరుణని అర్ధరాత్రే మేల్కొల్పింది. కాశీం పాపం తల్లిలేనివాడు. అయితే తండ్రి ఉన్నాడు. సవతితల్లి చిన్నమ్మే. అయినా తల్లిలేని లోటు తీరలేదు... కరుణ ఆరో జన్మదినం కాశీం ఆ ఇంట్లో ఉండగా జరిగింది. అద్దెగది అన్న పేరేగాని ఇంట్లో ఒకడిగా మెలిగాడు. తర్వాత మిలటరీలో చేరిపోయాడు. సికిందరాబాద్‌లో ఒకేడు ట్రైనింగ్ పూర్తయ్యాక రూర్కేలాలో ఇ.ఎమ్.ఇ. వర్క్‌షాప్‌లో వేశారు.

'అమ్మా, రేపు ——'

కరుణకి అమ్మ వినటం లేదని అనుమానం కలిగింది. 'అమ్మా' అన్నాడు మళ్లీ తట్టి. 'ఊ వింటున్నాను చెప్పు' అంది.

"అమ్మా. పెద్దన్నయ్య పంపించిన బట్టలేసుకోనా రేపు? లేక జయంవన్నయ్య పంపినవ్వేసుకోనా?" అన్నాడు. అమ్మ జవాబు ఆలస్యం అవటంతో "చెప్పూ" అని కొంతసేపాగి, "చెప్పమ్మా" అన్నాడు బతిమాలుతూ.

కరుణ అల్లరి తెలుసు పార్వతమ్మకి.

"చూడు కరుణా. తెల్లారనీ —— నువ్వు చాల మంచోడివి కదూ! నిద్రపోమ్మా యిప్పుడు, లే" అని తనమీద చక్కా చేరగిలబడి ముఖంమీద అమాయికంగా ముఖంపెట్టి, చీకట్లో అమ్మ మౌనాన్ని వెతుకుతూ తీరని సందేహాలనడుగుతున్నాడు కరుణ. కాని కరుణ పడుకోలేదు. లేచి, "పెద్దన్నయ్య పంపినవ్వేసుకొంటా. జయంవన్నయ్య పంపిన డ్రెస్సు రోజా పుట్టినరోజున వేసుకొంటా. అలాగేనా అమ్మా?" అన్నాడు తన ప్రణాళికను వివరిస్తూ.

నిజం చెప్పాలంటే కరుణకి పెద్దన్నయ్య అంటే ఎంతోప్రేమ. పెద్దన్నయ్య నాగపూర్‌లో ఒక పెద్ద పేరున్న బేంక్‌లో పనిచేస్తున్నాడు. వచ్చిన ప్రతిసారీ ఎన్నెన్నో తెస్తాడు —— ఆటబొమ్మలూ, రంగులబొమ్మలపుస్తకాలూ, మనకి దొరకని స్టాంపులూ, నాగపూర్ కమలా ఫలాలూ, ఎమ్‌పి గారబ్బాయి వేసుకొనేలాంటి చొక్కాలూ, నిక్కరూ —— ఇంకెన్నో. వదినకి కూడా తనంటే ముద్దే. ఇంట్లో ఉన్నన్నాళ్లూ తనెక్కడికి వెళ్లినా తనతో తీసుకువెళ్తాడు అన్నయ్య, ముస్తాబు చేసి. ఇద్దరూ పోటీపడి అమ్మ దగ్గర ఆడుకుంటారు. అమ్మ వొళ్లో పెద్దన్నయ్య పడుకుంటే కరుణ బాధ చూడాలి.

జయంవన్నయ్య కూడా మంచివాడే. కాని సాయంకాలం పార్క్‌కి పొరుగింటి సుందరం బుజ్జాయిలతో (సుందరం నాన్నగారు కె.జి. హాస్పిటల్ డాక్టర్‌గారు) పార్క్‌కి వెళ్లి ఊయలూగి ఆడుకుంటే కోప్పడుతాడు. 'గ్రౌండ్స్‌కెళ్లి ఫుట్‌బాల్ ఆడరా, ఆడపిల్లలాట లాడుతావేమిటి?' అని గ్రౌండ్‌కుతీసుకు వెళతాడు. అన్నయ్య ఉన్నన్నాళ్లూ ఆ బాబ్జీగాడు (వాడే కెప్టెన్) లెఫ్టె బాక్‌గనో, గోలర్‌గనో ఆడనిస్తాడుగాని

—— తర్వాత మరో ఆటకి —— మరో ఆటకి' అంటాడు. ఇల్లస్ట్రేటెడ్ వీక్లీ యంగ్‌ఫోక్ లీగ్‌లో మెంబర్ని చేసి ఆ పోటీల్లో పాల్గోమంటాడు. నాన్నారు సరిగ్గా చెప్పరు. ఓసారి కుటుంబం బొమ్మ వేయమన్నారు పోటీగా. ఆ బొమ్మవేసి పంపించమని ఇస్తే పోస్ట్ చేయడం మరచిపోయారు. తను నాన్నగారి పుస్తకంలో, ఆ పోటీగడువు అయిపోయాక తన కోడిపిల్లలూ ఎగిరే గద్దబొమ్మ కనబడింది. జయంవన్నయ్య ఎప్పుడూ ఫలానా పనిచేస్తే ఫలానిది ఇస్తానంటాడు. రంగులు పెట్టి అయిపోయిందని రాస్తే (అమ్మ కూడా రాయాలి లేకపోతే నమ్మడు) రెండోది పంపిస్తాడు. అంచేత జయంవన్నయ్య మంచివాడే కాని ——

'అమ్మా?' అని మళ్లీ తన లేత చేతులతో తట్టి, 'జయంవన్నయ్య పెయింటింగ్ చూసి సుందరం నాన్న ఎంతో మెచ్చుకొన్నారే' అన్నాడు ఎంతటికీ సంతృప్తిపొందని ఆనందంతో.

కరుణ ఆ విషయం సాయంకాలం ఇంట్లో ఉన్న వాళ్లందరికీ వరసగా ఒక్కొకరికీ ఒక్కోసారి చెప్పడం పార్వతమ్మ విన్నది. నిద్రలో ఉందేమో ఊగొట్టలేదు. ఆశ్చర్యపోలేదు. కరుణకి కొంచెం విసుగనిపించింది. 'చెప్పింది వినకూడదా ఏంవిటమ్మా?' అన్నాడు. ఎలాంటి బుంగమూతి పెట్టుంటాడో పార్వతమ్మకి తెలుసు.

'చెప్పావుగా, సాయంత్రం ——' అని నిద్ర చెడగొడుతున్నాడనిపించి, 'కరుణా! ఇంకా చాలరాత్రి ఉందమ్మా ——లే పడుకో. నాన్నగారు మార్నింగ్ వాక్‌కి లేపేసరికి లేవలేకపోతావు. లే, పడుకో' అని కరుణని తన పక్కనే వేసుకుని పడుకోబెట్టింది.

జయంవన్నయ్య ఒక ప్రఖ్యాత ఆంగ్ల దినపత్రికలో కళావిభాగంలో ఉన్నాడు. కరుణ పుట్టినరోజు పండుగ బహుమతులతో స్కౌట్‌డ్రెస్‌లో ఉన్న కరుణ చిత్రం రంగులతో వేసి వెనక లక్షలాది స్కౌట్ బాలలని చూపించాడు. పదహారంగుళాల చదరం ఆర్ట్ పేపరు మీద వేసిన ఆ చిత్రం ఎంతో అందంగా కనబడుతున్నది. సాయంత్రం వచ్చినప్పుడు అత్తయ్య, అత్తయ్యగారి కమలకూడ ఆ బొమ్మచూసి మెచ్చుకున్నారు.

కరుణకి నిద్రపట్టటంలేదు. పైగా తెల్లారుతున్నదనిపించింది. కొళాయి కనబడుతున్నది. అదుగో కిటికీపక్క చెమేలీలత కూడ. పూలమొక్కలూ, కింద పక్కేసుకు పరున్న రాజా —— పక్కనే అమ్మా —— చీకటికి కళ్లు అలవాటు పడ్డాయేమో అంతా కనబడుతున్నారు.

'అమ్మా, తెల్లారిందే ——' అన్నాడు ధైర్యంగా ఈసారి.

'లైట్ వేసి గడియారం చూడు' అంది ఇంక నిద్రపోనివ్వడు అనుకొని.

పార్వతమ్మకి ఆరోజు అర్ధరాత్రి పన్నెండు వరకు నిద్రలేదు. బయట ఉన్న గదిలో

అద్దెకుంటూన్న కుర్రవాడు ఈ రోజుకూడా వేళకి రాలేదు. వారం దినాలక్రితం దిగాడు. వేళాపాళాలేదు. ఏం చేస్తున్నాడో ఏవిటో ఎవరికీ తెలీదు. వాడి ధోరణి ఎవరికీ అర్థం కాలేదు. ఏ వేకువజామునో వచ్చి పదిగంటలవరకు నిద్రపోతాడు. నాలుగయిదు దినాలకి స్నానం చేస్తాడేమో. గదిలో ఉన్నంతసేపూ ఇంటివేపు చూడటంకాని నోరువిప్పి మాటాడటంకాని ఉండదు. పార్వతమ్మకి గది అద్దెకివ్వటం అసలు ఇష్టంలేదు బొత్తిగా. కాని శంకరయ్యగారి మాటకి తిరుగులేకపోవటం వల్ల ఆయన ఎలా అనుకొంటే అలా జరగాల్సిందే.

ఎనిమిదేళ్లక్రితం ఆ గదిలో ఉన్న కాలేజీకుర్రాళ్ల వల్ల జయుడు చెడిపోయాడన్న బాధ ఇప్పటికీ పార్వతమ్మ మనసులోంచి పోలేదు. జయుడు చాల గొప్పవాడయేవాడనీ, ఆ కుర్రాళ్ల చెడు సహవాసం వల్లనే చెడిపోయాడనీ ఆమె ఇప్పటికీ అంటుంది.

'పారూ... నీకు తెలీదు. పెద్దబ్బాయికంటే మన జయుడికే మంచి భవిష్యత్తుంది. నీకు ఆర్ట్‌సంగతి తెలీదులే...' అంటారు శంకరయ్యగారు. పార్వతమ్మకి ఆర్ట్ సంగతి తెలీకపోవచ్చు. కాని చెడిపోయాడని ఆమె ఎప్పుడు నిర్ధారణ చేసుకుంటుందంటే తన అన్నకొడుకు రామం ఐ.ఎ.ఎస్. అని జ్ఞాపకమొచ్చి, ఆ కార్లూ, ఆ బంగళాలూ, గౌరవాలూ కళ్లెదుట కనబడుతున్నపుడు.

శంకరయ్యగారు లౌకికమెరగని మనిషి. మనుషులందరూ మంచివాళ్లనీ, ప్రేమపాత్రులనీ ఆయన విశ్వాసం. తన బడేదో తప్పించి లోకంతో సంబంధం లేదాయనకి. మరో రెండేళ్లలో ఆయన రిటైర్ అవుతారు. హెడ్మాష్టరు అంటే ఆయనకి ఆయనే సాటి. ఇల్లూ, బడీ, కురుపాం మార్కెట్టూ కాక ఆయనికి ఇంకోమార్గమంటూ ఏదన్నా తెలుసునూ అంటే అది బీచ్ రోడ్డు —— అంతే —— ఆయన ప్రపంచం. ఎప్పుడన్నా కోపం వస్తే, 'పారూ, మనం, ఈ రెండేళ్లూ అయిపోయాక కాశీ పోదాం —— ఆ గంగ వడ్డున ——' అని ఊరుకొంటారు.

కరుణ లేచి స్టూల్ వేసుకొని స్విచ్ వెతికి లైట్ వేశాడు. గడియారం సరిగ్గా అప్పుడే కరుణని వెక్కిరించినట్టు రెండు గంటలు కొట్టింది. 'అమ్మా, ఇంకా రెండేనా?' అన్నాడు నిజంగా చాల విస్తుపోయి, స్విచ్ ఆఫ్ చేసివచ్చి చక్కా అమ్మ దగ్గర పడుకొని, మళ్లీ లేచి 'అమ్మా, రేపు కూడా నాన్నగారు బడి కెళ్లిపోతారా అమ్మా' అని పెద్ద నిరాశతో బెంగతో అడిగాడు.

అద్దెగది కుర్రాడి ఆలోచనల్లో ఉన్న పార్వతమ్మ 'పది గంటలకి కదరా బడి, ఆలోగా ఏం చేస్తావు? సరేగాని నువ్వు పడుక్కోమ్మా. మంచివాడివి కదూ?' అని మరోసారి బతిమాలింది. చెయ్యి కరుణమీద వేసి తన దగ్గిరికి తీసుకొని

జోకొట్టింది.

రోజానన్నా లేపి చెప్పాలనుకున్నాడు. రోజా కరుణకి అక్క అవుతుంది. అన్నయ్య తాగుడు మొదలయిన దుర్వ్యసనాలకిలోనై, ఆస్తి పాడుచేసుకొని చచ్చిపోతే, తల్లీదండ్రీ దిక్కులేని రోజాను పదేళ్లక్రితమే తీసుకొచ్చి తనకి ఆడపిల్లల్లేని లోటు తీర్చుకున్నారు శంకరయ్యగారు. రోజా తెలివితేటల్లోనే కాక పనిపాటల్లోకూడ చురుకయింది. బీ.ఎస్సీ. ఆఖరేడు చదువుతున్నది. కాని లేపితే అమ్మ ఊరుకోదే. అంచేత 'అమ్మా' అనేసరికి ----

'కరుణా, యీరోజు మరింక నిద్రపోవా నువ్వు? తెల్లారి లేచేసరికి కళ్లెర్ర బడతాయి. ఆరోగ్యం చెడుతుంది. ఇంక నీ ఇష్టం బాబూ, ఎవరన్నా పుట్టిన రోజున అలా ఎర్రని కళ్లతో, నిద్ర మొహంతో జోగుతూవుంటారా ఏంటి? అంచేత పడుకో నాన్నా. ఇంక నీగోల విన్నారంటే నాన్నగారు కూడా కోప్పడుతారు. చూడు రెండయిందా? నాలుగున్నరకి లేవాలా? అంచేత పడుకో అమ్మా. మంచివాడివి కదూ —— మానాన్న కదూ' అని నిద్రపుచ్చాలనే ప్రయత్నం. కరుణకి నిజమే అనిపించింది. కాని 'అమ్మా' అమ్మ కోప్పడుతుందనే బెంగతోనే 'ఈ ఒక్కటేనే —— ఈ ఒక్కటే చెప్పు', అని గుక్కతీసుకొని 'మరి అత్తయ్యగారి కమల పుట్టినరోజుకి మనం వెళ్లాం కదా —— అత్తయ్యగారు నాకు బొమ్మల బిష్కోటు ఇచ్చారు కదా —— అత్తయ్యగారి కమల వస్తుంది కదా —— మనంవూ?' అని వ్యవహార ధోరణి మొదలుపెట్టాడు. ఆ ధోరణి ఆపకపోతే ఎంతసేపన్నా కొనసాగుతుంది.

పార్వతమ్మకి ఈ కరుణ సందేహం ఎంత తేలిగ్గా తీర్చేయాలో, తీర్చేయవచ్చునో బాగా తెలుసు. ఆ అస్త్రమే ఉపయోగించిందామె. 'కరుణా, నువ్వు అర్ధరాత్రి లేపి అత్తయ్యగారి కమల గురించి మాటాడావని రోజాతో చెప్తా తెల్లారే' అంది.

దాంతో కరుణకి కోపమొచ్చింది. లేచి అమ్మ మీదపడి 'ఊ' అని కోపంతో అమ్మ ముఖాన్ని తోసేడు.

అత్తయ్యగారంటే కొన్నాళ్లు పొరుగింట్లో అద్దెకున్న లెక్చరర్‌గారి భార్య. వదినా అనేది పార్వతమ్మని. అన్నయ్యా అనేది శంకరయ్యగారిని. నాలుగయిదేళ్లు ఇరుగుపొరుగుల్లో ఉన్న వాళ్ల అనురాగాలు అతుక్కున్నాయి. వాళ్లు తర్వాత యూనివర్సిటీ క్వార్టర్స్‌కి వెళ్లిపోయినా దగ్గర బంధువులే. కొత్త స్నేహాలూ, జాతులూ, ఐశ్వర్యాలూ, పదవులూ ఏవీ అడ్డురాలేదు. కమలకు సుమారు కరుణ ఈడుంది. సన్నగా సన్నజాజి లతలా పూలతో నిండుగా ఉంటుంది.

'సరే చెప్పను నిద్రపోతావా మరి?' అని పరుండబెట్టింది. కరుణకి లోలోనే కోపం. ఎన్నెన్నో ప్రశ్నలు. అన్నీ తనలోనే అలానే అణచుకున్నాడు.

సరిగ్గా అప్పుడే బయట అద్దెగదిలో లైట్ వెలిగింది. కిటికీలోంచి కాంతి చారలు కొళాయిమీద పరచుకున్నాయి. బయిట తలుపులు మూసినచప్పుడైంది. పార్వతమ్మ కిటికీలోంచి చూసింది. పెరటి తలుపులు తెరచాడు. మళ్లీ చిట్టచీకటి.

తెల్లారి తొమ్మిదయింది. సుందరం వాళ్ల నాన్న కోప్పడితే, బడికి వెళ్లిపోయాడు. కాని బుజ్జాయి, బాబ్జీ ఉన్నారు. రోజా ఈ రోజు కాలేజీకి వెళ్లనని చేతిలో చెయ్యివేసి మాటిచ్చింది. అత్తయ్యగారూ కమలా వస్తామన్నారు. పోస్ట్‌మేన్ కాశీం అన్నయ్య పంపిన పార్శిల్ తెస్తాడు. నాన్నారు భగవద్గీత పూర్తిచేసి కళ్లద్దాలు తీసేయడం కూడ మరచిపోయి కూర్చున్నారు వాలు కుర్చీమీద. కరుణకి ఏఁవనిపించిందో పెద్దన్నయ్య పంపిన చొక్కా జయఁవన్నయ్య పంపిన నిక్కరూ వేసుకొన్నాడు. అమ్మ తలంటిపోసి సాంబ్రాణి పొగపెట్టింది. రోజా దుస్తులు తొడిగి, క్రాఫ్ దువ్వి ముస్తాబు చేసింది. గాలికి నవ్వే మల్లెపూవులా ఉన్నాడు. కరుణ కళ్లు మహాత్ములని వెతికే చూపులతో, అమ్మ ముద్దూమురిపాలని దాచుకొనే కాంతితో మిలమిల్లాడుతున్నాయి. ప్రపంచంలో తనకి ఇంకా పరిచయం కాని విడ్డూరాలనీ, వింతలనీ వెతికేటట్టు చేరడేసి ఉన్నాయి అమాయికంగా. శంకరంగారి పోలికే అంతా. కాని శంకరంగారి నవ్వుముఖంలో మంచితనం. వయసుతో వచ్చిన బాధ్యతలు ఎక్కువ. పార్వతమ్మ కాశీ అన్నపూర్ణలా ఉంది. నుదుట కుంకుమ శోభ, ఒకటో అరో నెరసినా —— నిండా నల్లని జుత్తు, పండిన తమలపాకు పచ్చటి శరీరం, చూసిన శిలకూడా 'అమ్మా' అని పలవరింప జేసే మమత బరువుతో సన్నగా ఉంది. కరుణ పుట్టినరోజు అన్ని ఏర్పాటులూ పూర్తి చేసేసి ఊపిరి పీల్చుకుంది.

అద్దెగది కుర్రాడు కింద పక్కేసుకొని నేలమీద ఒళ్లెరగని నిద్రపోతున్నాడు. పెరటి తలుపులు బార్లా తెరచి ఉంటం వలన స్పష్టంగా కనబడుతున్నాడు. అదే గదిలో పద్మనాభం, కాశీం, జగన్నాథరావ్, గోపాలకృష్ణ, అప్పలస్వామి, శేఖరం అంతా ఉన్నారు. వాళ్లంతా తన పిల్లల్లో ఒకరుగా, పండుగకీ పబ్బానికీ ఎంతో సందడిగా, సంబరపడిపోతూ ——

పెరటి ఇంటికీ బయట గదులకీ మధ్యన కొళాయి. ఆ ఇల్లు తూర్పుకి ఎదురుచేసి ఉంది. కుడిపక్క అంటే దక్షిణంగా రంగులు పోగుల్లా పూలమొక్కలు. అద్దెగది కుర్రాడు ఎప్పుడూ ఆవేళకి లేచిన గుర్తులేదు. పార్వతమ్మకి తెలీని వెలితి అనిపించింది. కాశీం ఎంత మధన పడ్డాడు! ఎంత సంఘర్షణ అనుభవించాడు! ఐతేనేం —— కాశీం ఎంత మంచివాడు! ఇప్పటికీ అప్పలస్వామి, పద్మనాభం, శేఖరం, గోపాలకృష్ణ, జగన్నాథరావ్ శంకరయ్యగారిపేర ఉండీ ఉడిగీ ఉత్తరాలు రాస్తూనే ఉంటారు. పండగలకి గ్రీటింగ్స్ వస్తూనే ఉంటాయి.

కరుణ నాన్నగారి దగ్గరికి వచ్చి. 'మరేంటి నాన్నారూ, డాక్టరుగారి సుందరం బడికి వెళ్లిపోయాడు. వాళ్ల నాన్నారు కొప్పడ్డారట. మరేం —' అని గుక్కలు మింగుతున్నాడు.

రోజా, సన్నగా పచ్చగా పూలతో పెరిగిన మందారమొక్కలా ఉంటుంది, వచ్చి 'నాన్నారూ సుందరం రాలేదు. డాక్టరుగారితో చెప్పి రప్పించండి. వీడి మనసు మనసులో లేదు' అని చెప్పేసి వెళ్లిపోయింది అమ్మ దగ్గరికి. ఊరుకుందా — ఊరుకోక 'అమ్మా నాన్నారితో చెప్పానే వీడికి మనసులో మనసులేదని.' పక్కనే ఉన్నాడు కరుణ. కొంచెం జడిసి, మెత్తగా 'వెంటనే అత్తయ్యగారినీ —' అనేసరికి పెద్దకేక వేసి బెదిరించాడు అల్లరి చేస్తాను అనే గొంతుతో కరుణ. దాంతో రోజా నవ్వి ఏమీ ఎరగనట్టు ఊరుకుంది. పార్వతమ్మ ఓ పక్క మురిసిపోయి, నవ్వితే వచ్చి మీదపడతాడని, పనుల్లో మునిగిపోయి పట్టించుకోనట్టు నటించింది.

* * *

'కరుణా చూడు' అని అమ్మ పిలిచి 'చూశావా?' అని అద్దెగది చూపి, 'ఆ అన్నయ్యని లేపు వెళ్లు. నీపుట్టిన్రోజు పండుగ అన్చెప్పు. వెళ్లు' అని పంపింది. ఆమె మనసులో వ్యాకులతా, వెలితీ సర్దుకొన్నట్టుంది. కరుణ మొదట్లో తొందరపడ్డా తర్వాత జంకుతూ వెళ్లాడు.

కరుణకి ఆ గది వేరే అన్నభావం ఎప్పుడూలేదు. కాని ఈ వారం దినాలనించీ అద్దెకు చేరిన ఈ కొత్తమనిషితో గది కొత్తగా తోస్తున్నది. అక్కడికి వెళ్లటం లేదు. అమ్మ, అన్నయ్యని లేపమనేసరికల్లా కరుణలో భయం పోయింది. 'అన్నయ్యేనా అయ్యో' అనుకున్నాడు. అన్నయ్యంటే కరుణకి కాశీం, గోపాలకృష్ణ, శేఖరం, పెద్దన్నయ్య, జయంవన్నయ్య అంతా గుర్తుకొస్తారు. వాళ్లమీద గంతులేయటం, అలగటం, ఎత్తుకుంటే దిగక అల్లరి చేయటం — అవన్నీ.

కరుణ ఆ గదిలో అడుగు పెట్టాడు. బుజ్జాయి, బుచ్చీకూడా వాడితో వెంటఉన్నారు. కింద నేలమీద పక్కవేసుకొని నిద్రపోతూంటే తలదగ్గర కూర్చుని, చేతితో తట్టి 'అన్నయ్యా' అన్నాడు చెవిలో కరుణ.

'అన్నయ్యా' అన్నాడు కరుణ మళ్లీ.

కదిలి పిల్లలని చూసి 'పోంద్రా, పోంద్రా' అని కసరుకుని పడుకున్నాడు. ఆ గొంతు భయంగా ఉంది. ఆ గొంతులో ఉమ్మి ముఖంమీద పడినట్టయింది. పక్కనే ఉలవకాయ వొంపుతో ఒక మెరిసే కత్తి ఉంది. అది వాళ్ల దృష్టిలో పడేసరికి ఆ ముగ్గురు పిల్లలకి కాళ్లు వణికాయి. బుజ్జాయిగాడు చెమర్చాడు. గదిబయటికి

వెళ్ళిపోయాడు. కరుణ ఆగి చూసి ఏం చేయాలో తెలీని పరిస్థితిలో పడ్డాడు. పిల్లల వాసన మళ్లీ తగిలిందేమో 'పోంద్రా' అన్నాడు. ఈసారి మరింత కఠినంగా —— రాళ్లు విసిరినట్టుగా. కత్తి వొణికింది పరుపుమీద. దాంతో అంతా అమ్మ దగ్గరకి పరుగెత్తారు.

పార్వతమ్మకి అంతా చెప్తే విని 'అది కాదు నాన్నా —— లేపు. అన్నయ్యా! నా పుట్టిన్రోజు పండుగ యీ రోజు. లే అను' ---- బోధపరిచింది.

'కత్తి ఉందే అమ్మా. ఆ పక్కనే' అన్నాడు తన భయాన్ని వెళ్లబోసుకొంటూ.

'కత్తీకాదు పాదూకాదు —— వెళ్లి అమ్మ చెప్పిందని లెమ్మను. తొమ్మిదయింది. మరీ అంత మొద్దునిద్ర మంచిదికాదు' అని చెప్పి, వెనకాడుతుంటే చూసి, 'వెళ్లు నాన్నా —— వెళ్లు. అత్తయ్యగారూ, కమలా అంతా వచ్చేస్తారు. పోస్ట్‌మేన్ కూడ మరో నిమిషానికో అరకో కాశీం అన్నయ్య పంపిన పార్శిల్ పట్టుకువచ్చేస్తాడు. వెళ్లి లేపు. అలా ఇంట్లో ఒకరు నిద్రపోతుంటే పండగ చేసుకోకూడదు, తప్పు' అని చెప్పింది పార్వతమ్మ, నిండు గొంతుతో. ఆమె ఆకుపచ్చని బరంపురం పట్టుచీర —— ఇల్లంతా పచ్చగా —— పసరు చేనుతో ఉన్న పొలంలా —— అందంగా, చల్లగా ఉంది.

కాశీం అన్నయ్య దగ్గరయితే రోజా ఎంత అధికారం చెలాయించేదని. ఎందుకో ఈయన్ని చూస్తే మృగాన్ని చూసినంత భయం. అసలు 'వద్దులే అమ్మా ---- ఎందుకు కొరవితో తలగోక్కోవటం' అనాలని పెదవివరకూ వచ్చింది. కాని మంచిచెడ్డలు తెలీకుండా సలహాలు ఇవ్వటం బావుండదని నోరు మూసుకుంది రోజా.

శంకరయ్యగారు తిరిగివచ్చి కరుణని పిలిచేసరికి కరుణ అద్దెగది అన్నయ్యని మేల్కొల్పే ప్రయత్నంలో ఉన్నాడు. 'అన్నయ్య' పక్కనే కూర్చుని చిన్న చేతులతో తట్టి, 'లే —— అమ్మ లెమ్మంటోంది. ఈ రోజు నా పుట్టిన్రోజు పండగ —— లే —— లే అన్నయ్యా' అంటున్న గొంతు వినిపించింది శంకరయ్యగారికి, పక్కగది నుండి. విని ఆయన ఆ గదికి వచ్చి 'లేవయ్యా —— లే, రాఘవా —— మన కరుణ పుట్టిన్రోజు' అన్నారు పిల్లవాడంత ఉల్లాసంతో.

రాఘవకి ఇది కలలా ఉంది. ఆ గొంతులో ఎంతో తియ్యదనం, ఆ మాటల్లో ఎంతో మమతాభావం, తనని ఏ సుందర ప్రాంతాలకో తీసుకుపోయాయి. కలలో ఉన్నట్టు అయింది. పక్కమీదనే ఉన్న కత్తిచూసి శంకరయ్యగారు హడలి పోవటమేకాదు, రాఘవ నిజచిత్రాన్ని చూడటం కూడా ఆ నిమిషంలోనే జరిగిపోయింది. దాంతో కొంత తబ్బిబ్బయిన శంకరయ్యగారు 'కరుణా, సుందరంని తీసుకురావటానికి కారు వెళ్లిందిరా. వచ్చేస్తాడు. నువ్వు అమ్మదగ్గర కివెళ్లు. అన్నయ్య లేచాడని చెప్పు ---- వెళ్లండి' అని పిల్లవాళ్ల వేపు చూట్టంతో వెళ్లిపోయారు. వాళ్లు

పెద్ద విజయంగా మురిసిపోయారు.

రాఘవ, శంకరయ్యగారు కత్తిచూసి సంశయించటం పసిగట్టి, కత్తి పట్టుకొని పదును చూస్తూ 'నాకీ మనుషుల మీద విశ్వాసం లేదండీ. అందుకూ యీ కత్తి. మొరటుగా మాటాడుతున్నాననుకోకండి. నా నమ్మకం బహుశా మారదు. ఈలోకం ఇలా ఉన్నన్నాళ్లూ' అన్నాడు. రాఘవ కళ్లెర్రగా చింతనిప్పుల్లా ఉన్నాయి. బలమైన శరీరంతో పాటు బలమైన గొంతుక కూడా ఉంది. ఆ గొంతులో, ఆ రూపులో, ఆ ధోరణిలో చిన్న చిన్న గాలులకి ఎగిరిపోయే నిశ్చయాలు అసలు ఉన్నట్టే కన్పించవు. 'నన్ను రాక్షసుడన్నా బాధపడను' అన్నాడు మళ్లీ.

ఆయన మితభాషి. కాని రాఘవ గొంతు ఎంత మూర్ఖంగా ఉందో అర్థమయింది. ఉద్రేకపడితే లాభంలేదు. ఎక్కడా ఆ ఉద్రేకం కనిపించదుకూడా. కాని చెడుని సహించటమంత అన్యాయం భరించలేరాయన. అందుకే —— మెత్తని గొంతుతో ——

'నీడను చూసి భయపడకూడదబ్బాయ్. సామాన్యంగా అలాంటివాళ్లు పరమ పిరికివాళ్లు. రాక్షసులకంటే దుష్టులు.' అన్నారు.

'పిరికితనమా?' అన్నాడు. తనని హీనపరిచినట్టుంది.

'ఉద్రేక పడవద్దబ్బాయ్, పిరికితనం కాకపోతే నువ్వు కత్తి పట్టుకోవాల్సిన అవసరం ఏంవొచ్చింది చెప్పు? ప్రతివాణ్ణి చూసి భయపడుతున్నావన్నమాట. తాడును చూసి పాము అనుకోవటమంటే అదే,' రాఘవ తెలివితక్కువతనానికి ముద్దొచ్చి నవ్వి 'మహాత్మా' అన్నారు శూన్యంలోకి చూసి శంకరయ్యగారు. 'సరే నబ్బాయ్ నీ కత్తిచూసి పిరికిగా పరుగెత్తే వాళ్లెవరూ ఇక్కడ లేరు. కాని నువ్వు మాత్రం నీడని చూసి గంతు లెయ్యకు, లే ——' అని శంకరయ్యగారు వెళ్లిపోయారు.

ముఖం కడుక్కోటానికి కొళాయి దగ్గిర నుంచున్నాడు రాఘవ. పార్వతమ్మ చూసి 'ఈ రోజు భోజనానికి ఇక్కడే ఉండి పోవాలబ్బాయ్. కరుణ పుట్టిన్రోజు. అర్ధరాత్రే లేచిపోయాడు. వాడి హడావిడే ఇదంతానూ' అంది రాఘవతో.

పార్వతమ్మ ఎంత ప్రేమతో చెప్పిందో రాఘవకి తెలుసు. కాని ఆ ప్రేమ సహించలేడు రాఘవ. తను చూసిన ప్రపంచమంతా మోసం. మొదటి రోజు ప్రేమతో పిలుపు. తమ సేవ చేయించుకోవటం. అవసరం తీరిపోతే ఎంగిలాకుని పారేసినట్టు పారేయటం, తనకి బాగా తెలుసు. లోకంలో మనుషులకి అంతకంటే విశాల దృక్పథం లేదు. స్వార్థపరులు. తనకి ఉపకరిస్తే మంచివాడు. లేకపోతే సంఘానికి చీడపురుగు. తన మనసులో సముద్రమంత విషం నింపుకొని నోటిలోంచి అమృతం ఒలకబోసినట్లు మాటాడి నటిస్తారు. అంచేత ఈ పార్వతమ్మల్లాంటి వాళ్లని

చాలామందిని చూసానన్న గర్వంతో రాఘవ 'నాకు ఇలాంటి పండుగల్లోగాని, అతిథ్యాల్లోగాని బొత్తిగా విశ్వాసం లేదండీ. నేను అసహ్యించుకుంటాను' అన్నాడు. రాఘవ ముఖం మీద ఎంత రాక్షసత్వం ఉందో, గుండెలో ఎంత కాఠిన్యం ఉందో అప్పుడే చూసింది పార్వతమ్మ. రాఘవ చూపుల్లో ఉరితాళ్లు వేలాడుతూ ఉండటం చూసింది రోజా.

నవ్వొచ్చింది అంత బాధలోనూ పార్వతమ్మకి. అందుకే 'నేనలా పిలవటంలో తప్పు చేశానా, అబ్బాయ్?' అని తెలుసుకోగోరింది. 'నేను తప్పే చేస్తే భగవంతుని క్షమాపణ కోరుతాను.'

'తప్పు చేశానా' అన్న పార్వతమ్మ మాటా, ఆమె నవ్వులోని బాధా, ప్రశ్నా — సుత్తి దెబ్బల్లా తగిలాయి రాఘవకి. కాని 'భగవంతుని క్షమాపణ' అని కలపటంతో మళ్లీ తననొప్పిని కడిగేసినట్టయింది. ఈసారి గొంతులో మరింత కసీ కాఠిన్యమూ, ఏహ్యతా చేర్చి. 'భగవంతుడనే వాళ్లంతా పరమ పిరికిపందలు, దొంగలు అంతే కాదు. తడిగుడ్డతో గొంతు కోసేవాళ్లు. మేకతోలు కప్పుకున్న పులులు. భగవంతుడు అన్నమాట పూర్తిగా లోకం కళ్లు కప్పటానికి మాత్రమే ఉపయోగించుకుంటున్నారు' అన్నాడు రెచ్చిపోతూ.

'ఆ దృష్టితో చూస్తే ఈ మనుష్యుల కంటే మృగాలూ, వృక్షాలూ వేయిరెట్లు నయం. అవేవీ ఈ మోసాలు చేయవు. వాటికి భగవంతుడు ఉంటే అవి మనసులో ప్రార్థించుకుంటాయేమో గాని తీపి మాటలతోటి స్వార్థప్రయోజనాలు నెరవేర్చుకోవు.' ఆ గొంతులో క్రూరత్వం పార్వతమ్మ హృదయాన్ని ఎలా రంపానపెట్టిందో బహుశా ఆమెకొక్కతికే తెలుసు. అప్పటికి బాగా వాడిపోయి, వేలాడినట్టు తయారయి, పేలవంగా 'సరే నబ్బాయ్, నన్నన్నా క్షమించగలవా? చెప్పు,' అంది.

'క్షమించటానికి నేనెవణ్నండీ?' అన్నాడు. ఆ మాటలోకూడా కరుకుతనం, ఆవేశం ఉన్నాయి. ఈ ప్రశ్నతో కూడా తానాశించిన జవాబు రాకపోయేసరికి పార్వతమ్మ ఇంకా ఎక్కువ మాటాడదలచుకోలేదు.

'ఇటు వినబ్బాయ్! ఈ ఇంట్లో నువ్వు కూడా ఒకడివి. అందుకు నేనలా చెప్పి నీకు కోపం తెప్పించాను. మా పెద్దబ్బాయి నీకంటే పెద్దవాడు. వాడు కోప్పడేటప్పుడు, తిట్టినప్పుడు, కాదన్నప్పుడు నేనేమన్నా మాటాడగలిగానా, ఈరోజు నీకు జవాబు చెప్పటానికి? లేక నే నేమన్నా పురాణాలూ, కావ్యాలూ, ధర్మ శాస్త్రాలూ చదువు కొన్నానా, దేశాలు తిరిగానా? నాకేం తెలుసునబ్బాయ్' అని తన తెలివి తక్కువతనాన్ని అతని కళ్లకీ చెవులకీ తేటతెల్లం చేసింది.

ముఖం కడుక్కొన్న రాఘవకి ఈసారి ఏశక్తీ కనిపించలేదు. చనిపోయిన

పాముమీద కసి ఎట్లా తీర్చుకోవటం? ఓడిపోయి దాసోహం అన్న వాడిని ఇంకా హింసించటం ఎట్లా? తెలీలేదు. అలా ఇంకా పగతీర్చుకోబోయేవారంటే పిరికివాళ్లమీద ఉన్న జాలికూడలేదు.

సుందరం రావటంతో పిల్లలు గంతులేసి గోలచేశారు. పార్వతమ్మ చివరికి సంతృప్తిగానే తన పనుల్లోకి తిరిగి వెళ్లిపోయింది.

రోజా ఈ వాదనలన్నీ వింటున్నది. ఆమెలో వెయ్యి సమాధానాల విచ్చుకత్తులున్నాయి. పడగలు విప్పి బుసకొట్టే శక్తి ఉంది. అమ్మ వచ్చాక 'అమ్మా, కుక్కకాటుకి చెప్పుదెబ్బే కాని మంత్రం పనికిరాదే' అన్నమాట నాలుక కొసవరకూ వచ్చి ఊరుకుంది. మౌనంగా ఉండిపోయింది.

* * *

మరో వారందినాలు గడిచినట్టున్నాయి. ఆరోజు ఇంటిలో, ఒక్క పార్వతమ్మే ఉంది. సుమారు ఉదయం పదిగంటలయింది. ఇంకా రాఘవ లేవలేదు. కరుణ పుట్టినరోజు ఎలాగయితేనేం రాఘవని పిలిచి శంకరయ్యగారి సహపంక్తిన భోజనం పెట్టింది. ఆ రోజు రాఘవకి మళ్లీ అనురాగాల గోతుల్లోకి దిగిపోతున్నట్టు అనిపించింది. అయినా గుప్‌చుప్‌గా విస్తట్లో పెట్టినవన్నీ తిన్నాడు. బలవంతం చేసి మళ్లీ మళ్లీ వడ్డించినవి కూడా తిని సంతృప్తిగా త్రేన్చాడు. రాఘవ కుంభకర్ణుడిలా నిద్ర పోవటమూ, బకాసురుడిలా తినటం రెండూ చిత్రంగాను, వింతగాను ఉన్నాయి. అంతా అయాక 'ఈ కాలేజీ కుర్రాళ్ల తిండిలాంటిదయితే డజను విస్తళ్లు ఉఫ్‌మని ఊదేస్తాను.' ఎంత సంతోషమో మరి. పార్వతమ్మ, నిర్మలంగా హాయిగా నవ్వింది.

తర్వాత ఒకటి రెండుసార్లు మధ్యాహ్నం పలహారాలవేళ కరుణతో పంపిస్తే నిరభ్యంతరంగా తినేవాడు. కాని అర్ధరాత్రులు రావటం, దూర దూరంగా వేయి అనుమానాలతో, అపనమ్మకాలతో ఉండటం పార్వతమ్మని ఏ నిమిషానికి ఆ నిమిషమే చిత్రహింస చేస్తున్నాయి. రాఘవకి పాతికేళ్లు ఉండవచ్చు. తన పెద్దబ్బాయికి ఇరవై ఎనిమిది మొన్నటి ఉగాదికి. జయుడికి ఇరవైనాలుగు. కాశీంకి ఇరవైరెండు వచ్చే జనవరికి. పార్వతమ్మకి తెలుసు, తన పిల్లలంతా కలుపుగోలుగా ఉంటారు.

రాఘవని లేపాలనే ఉద్దేశంతో గదిలోకి పార్వతమ్మ మొదటిసారిగా వచ్చింది. గదిలో అల్లరి చిల్లరగా వస్తువులు పారేసి ఉన్నాయి. మైమరచి నిద్రపోతున్నాడు.

'అబ్బాయ్! రాఘవా' అంది దగ్గరే నిల్చొని.

ఏ కదిలికాలేదు.

మళ్లీ పిలిచింది —— ఈసారి మరి కొంచెం బిగ్గరగా.

కదిలాడు. మళ్లీ పార్వతమ్మ పిలుపు.

విసుక్కొని కసరలేక లేచి కూర్చున్నాడు. పక్కనే ఉలవకాయ ఒంపుతో మెరిసే పదునుతీరిన కత్తి. ఆ కత్తి చూసి నవ్వాలనిపించిందామెకి. ఎవరన్నా కత్తి దాచుకొంటారు. కాని బయిట తన విరోధికి కనబడేట్టు పెట్టుకొంటారా? పిచ్చోడు అనుకుంది.

'లే అబ్బాయ్, పదిగంటలయింది.'

రాఘవ ఆవలింత తీశాడు.

'చూడు ఈ ఇల్లంతా ఏవిటిట్లా? తెల్లారే లేస్తే నూకాలమ్మ తుడిచేయక పోయేదా?'

ఆవలింతనించి పార్వతమ్మ జీవితంలో ఏనాడూ ఎరగని వాసన వచ్చింది. మొహం తిప్పుకొని 'లేచి ముఖం కడుక్కో' అని వెళ్లిపోయింది.

రాఘవ కొళాయిగట్టుమీద కూర్చున్నాడు. గడపలో బియ్యం పోసుకుని వడ్లూ, రాళ్లూ ఏరుతున్న పార్వతమ్మ చూసి, 'రాఘవా! మీ అమ్మా అంతా ఎక్కడున్నారబ్బాయ్?' అడిగింది. ఆ వివరాలు తెలుసుకోవాలని మొదటిరోజు నించీ ఉందామెలో.

ఇలాంటి వ్యక్తిగత విషయాలు అడిగితే రాఘవకి ఎంతో చిరాకు. తర్వాత్తర్వాత ఆ సంగతులు ఎంతో బాధిస్తాయి. ముఖ్యంగా తన జీవిత చరిత్ర అలాంటిది. మింగలేడు. కక్కనూలేడు. ఆ లోపాలూ, ఆ లొసుగులూ ప్రతి సంభాషణలోనూ దొర్లి నిమిష నిమిషమూ శాంతి లేకుండా శిక్షిస్తాయ్. అయినా——

'తల్లీ తండ్రీ లేరండి' అన్నాడు.

ఆశ్చర్యపోయింది పార్వతమ్మ. దిక్కులేనివాడనే జాలి ఆమెకి కలగటం దుర్భరంగా ఉంది రాఘవకి.

'పోయారా?' అంది మరింత విస్మయంతో.

'అవునండి, చిన్ననాడే'

'తోబుట్టువులు?'

'ఎవ్వరూ లేరండి.'

'వెనకా ముందూ ఎవరూ లేరా? మరెలా ——' సగంలోనే పార్వతమ్మ ఆపేసింది.

'ఓ మేనమామ ఉన్నాడండీ. వాడింటే పెరిగాను. గొడ్డుచాకిరీ చేయించాడు. ఎట్టాగో నా మట్టుగ నేను మెట్రిక్యులేషన్ చదివి పాసయి వచ్చేశాను. మాకు ఉన్న ఆస్తి అమ్మేసి బ్యాంకులో వేసేసానండీ —— ఓ నాలుగువేలు' అన్నాడు.

పార్వతమ్మ కళ్లు అశ్రువులతో నిండిపోయాయి.

'పెళ్లి చేసుకోకూడదా అబ్బాయ్?' అంది పార్వతమ్మ. అలాగన్నా జీవితం కొంత బాగుపడుతుందనే నమ్మకంతో. అంతకంటే ఇంకో మార్గంలేదు రాఘవ దురదృష్ట జీవితానికి.

కాని ఆ మాటలు విని 'పెళ్లి చేసుకోనండీ. నాకు పెళ్లిమీద ఏ మాత్రం విశ్వాసం లేదు. స్త్రీని ఈ ప్రపంచంలో నేన్నమ్మను!' అన్నాడు రాఘవ. పార్వతమ్మకి తిట్లకంటే వాడిగా ఉన్నాయా మాటలు.

తల్లిలేని లోటు రోజాకి లేదు. కాశీంకి లేదు. కాని ఈ రాఘవకి ఆ లోటే కాదు దానివలన లోకంమీద పగ ఉంది. కక్ష కూడా ఏర్పడింది. ఆమె కన్నీరు తుడుచుకోవటం చూసి రాఘవ ముఖం కడుక్కుని గదిలోకి వెళ్లిపోయాడు. అతని మీద మంత్రజలంలా ఆ కన్నీరు పనిచేసినట్టుంది. తెలీని బాధకీ, హింసకీ గురి అయ్యాడు. ఇలాంటి విషయాలు అడగటం, చెప్పటం, వాళ్ల సానుభూతి- ఇవన్నీ సహించలేని రాఘవకి మరింత అసహనం పెరిగింది.

* * *

రాత్రి అప్పుడే ఎనిమిది గంటలు కొట్టింది గోడగడియారం. రోజా తన గదిలో చదువుకుంటున్నది. తెల్లారే డి.యి.వో ఇన్‌స్పెక్షన్ అని ఆఫీస్ పనులు చూసుకోవటానికి శంకరయ్యగారు ఐదు నిమిషాల క్రితమే భోంచేసి మళ్లీ బడికి వెళ్లారు. పూలమొక్కల మీద వెన్నెల చల్లగా కురుస్తున్నది నిరంతరంగా. కరుణ అమ్మకి పెరుగన్నం కుడుపుతానని అల్లరి చేస్తున్నాడు. 'సరే, నీ ఇష్టం' అని చిన్నారి చేతులతో నోరింతచేసి తెరచి అమ్మకి ముద్దా ముద్దా కుడుపుతూ ఉంటే తింటున్నది. మొఖం అంతా ఎంగిలి చేస్తున్నాడని 'ఇంకచాల్లే నాన్నా. వెళ్లి చదువుకో' అంది.

కొళాయి చప్పుడయింది. నీళ్లు రావటంలేదు. చెప్పులు చప్పుడు విని బయటికి చూసింది రోజా. 'మంచినీళ్లు కావాలండీ' అనే గొంతు వినబడింది నీరసంగా వణుకుతూ. దాంతో, 'ఎవరో చూసిరా' అని పార్వతమ్మ కరుణకి చెప్పటం విని రోజా కదల్లేదు. కరుణ వంటగదిలోంచి వచ్చి గడపలో నిల్చొనిఉన్న రాఘవని చూసి పరుగెత్తు కెళ్లి 'రాఘవన్నయ్యే, మంచినీళ్లు కావాలంట' అని చెయ్యి కడిగేసుకొని 'ఇచ్చి వస్తావుండు. నువ్వు పళ్లెంలో చెయ్యి పెట్టకేం' అని హెచ్చరించి నీళ్లు తీసుకుని వెళ్లాడు చెంబుతో. చెంబెడు నీళ్లు గడగడా తాగేసి 'ఇంకొంచెం' అన్నాడు రాఘవ. రెండోసారి తీసుకుని వెళుతుంటే 'పిలువిక్కడికి' అంది. కరుణ నీళ్లిచ్చి రమ్మని రాఘవని తీసుకువెళ్లాడు వంటగదిలోకి.

'కూచోవయ్యా' అని పీట చూపింది పార్వతమ్మ. సరిగ్గా రాఘవ ముఖంలోకి చూడలేదు.

కూర్చున్నాడు.

కరుణ అమ్మ చేస్తున్నపని చూసి 'అమ్మదొంగా' అని చేయిపట్టేసి, పక్కకి ఉంచేసి, తను ముద్దలు చేసి పెట్టటం మొదలెట్టాడు. పెద్దబ్బాయి వచ్చిన ప్రతిసారీ పెరుగన్నం ముద్దలు అమ్మచేత తినిపించాలని ఎంతో ప్రయత్నం చేస్తాడు! అమ్మ కోప్పడుతుంది. తర్వాత వేళాకోళం చేస్తుంది. 'చందమామని కూడా తెచ్చి పెడతావా నాన్నా?' అంటుంది. జయుడు ఉంటే ఇంతా అంతా కాదు అల్లరి. చిన్ననాటి నించీ వాడంతే. ముగ్గురూ ఉంటే ఇంక వేరే చెప్పాలా?

'మీరు భోంచేయండి. వెళతాను' అన్నాడు.

రాఘవ ముఖంమీద వెలుతురు బాగా పడుతున్నది. ముఖం అంతా ఎంతో ఆవేశంతో తుఫాన్ దెబ్బతిన్న అడవిలా ఉంది.

'అదేంటయ్యా అలా ఉన్నావ్?'

కొంతసేపు చెప్పలేకపోయాడు.

ఇంక తిండి ఆమెకి సహించలేదు. పళ్లెం ఓ పక్కకి తీసేసి 'లే. కరుణా లే, అన్నయ్య కేఁవయిందో చూడు' అని తొందర తొందరగా సగం పెరుగన్నం ఉన్న పళ్లెంలోనే నోరూ చేయీ కడుక్కొని 'ఏవయిందబ్బాయ్' అని దగ్గరకు వచ్చి నిల్చుంది.

రాఘవ ముఖాన్ని బాధ కప్పేసింది. కళ్లనిండా గిర్రున నీళ్లు తిరిగాయి. ఏమయిందో తెలీని భయంతో 'ఏవయిందబ్బాయ్ చెప్పు?' అంది రాఘవ కళ్లనుండి ఒక్కొక్కటే కన్నీటి చుక్కలు నేలపడి తుళ్లుతున్నాయి. మొఖం కిందికి దించుకున్నాడు.

'అన్యాయం చేసారండి దొంగరాస్కెల్స్' అన్నాడు. 'ఎవరు చేసారు అన్యాయం నీకు? ఎవరు ఆ దుండగులు రాఘవా?' అంది ఆ బొంగురు ఏడుపుగొంతు విని. నిజానికి పార్వతమ్మే కాదు చూసిన ఎవరు కూడా రాఘవ ప్రపంచాన్ని చూసి భయపడి కన్నీళ్లు పెట్టుకుని ఏడుస్తాడనుకోరు. అది దిక్కులేని ఆక్రందన. పార్వతమ్మ గుండెని హూనం చేస్తున్న దృశ్యం.

'వెయ్యి రూపాయిలు నా పైసలు దోచుకొన్నారండీ నా దగ్గర. క్లబ్‌లో. బాగా కొట్టారు. వొళ్లంతా నొప్పులు నొప్పులు.'

ఆ గొంతువిని రోజా కూడా కళ్లింతవి చేసుకొని ఆ గదిలోకి వచ్చింది.

పార్వతమ్మకి ఏమీ పాలుపోలేదు. ముచ్చెమటలు పోశాయి. ఇలాంటి ఘోరం తన ఇంటా వంటా లేదు. ఏనాడో కథలుగా విందేమోగాని యధార్థంగా తనెరగదు. నోరు వింతవాసన కొడుతున్నది. కళ్లు ఎర్రగా ఉన్నాయి. దిక్కులేని ఏడుపు

ఏడుస్తున్నాడు. రోజా చూసి వణికిపోతున్నది. ముఖం తెల్లవోయింది రాఘవ దీనావస్థకి. రోజాలో అతడి పట్ల ఉన్న ఏవగింపు పోయి సానుభూతి కలుగుతున్నది. నిశ్చేష్టితురాలై చూస్తున్నది.

'అన్నం పెట్టు రోజా'

తనకేనని, అన్నం తినాలనిపించక 'వద్దండి' అని తల తిప్పాడు రాఘవ.

'పోనీ గ్లాసెడు పాలందుకో రోజా.'

పార్వతమ్మ కళ్లల్లో కన్నీళ్లు ఉరుకుతున్నాయి. రోజా పాలు తెచ్చింది.

'జీవితంలో ఏరోజూ ఏడవలేదండీ, నేను' అని దుఃఖం మింగుకోలేక బావురుమన్నాడు. వివర్ణమయందామె ముఖం.

'వొద్దన్నాడు పాలగ్లాసు అందిస్తూ ఉంటే. పార్వతమ్మే గ్లాసు నోటిదగ్గర పెట్టి 'తాగు నాయనా. తాగు' అని బతిమాలింది దగ్గరగా కూర్చొని. మెల్లగా తాగాడు. ఆమె మమతామయ హస్తస్పర్శ లేకపోతే ఆ పాలూ తాగలేకపోయేవాడు. రోజా గోడకంటుకుపోయింది నివ్వెరపోతూ. కరుణకి ఇదంతా ఏమీ అర్థం కావటం లేదు.

'నా జీవితం చూస్తే నాకే రోత. నాకు ఈ ప్రపంచం అంటే అంతకంటే రోత. నిజం మీ దగ్గర దాచాను. నాకు తల్లీ ఉంది. తండ్రీ ఉన్నాడు. కాని ఏ మనిషికీ అలాంటి తల్లీ ఉండదు. అలాంటి తండ్రీ ఉండడు. అందుకే వాళ్లున్నారని చెప్పడం కంటే లేరనే అనుకుంటాను. అంటుంటాను. నా తల్లి నాచిన్నతనంలోనే ----' అని ఆగాడు రాఘవ. ఆ గొంతు ఎంత దెబ్బతిందో ఎంతటి అసహాయావస్థలో ఉందో పార్వతమ్మకే కాదు, రోజాకి కూడా తెలుస్తూనే ఉంది.

పార్వతమ్మకి ఈ కొత్త సంగతి వింతగా ఉంది. ఆమె మతిపోయింది. తన పాదాలకింది భూమి పరుగులు తీస్తున్నట్టు అయింది.

ఇంక అధికం నోరు పెగలక ఆపూ అంతూ లేకుండావస్తూన్న దుఃఖతరంగాలని మింగుకొని కళ్లనించి కురుస్తూన్న కన్నీటిని రెండు చేతులతోనూ తుడుచుకున్నాడు. వెక్కుతూ 'తండ్రి కుక్కకంటే హీనంగా చూసి పెంచాడు. నన్ను చంపేయాలని అనుకొన్నారు సవతి తల్లీ తండ్రీ కలిసి. కాని నేను ఒకరోజు రాత్రి వాడి గుండెలమీద కూర్చున్నాను కత్తితో. పిరికి వెధవలా ఏడ్చాడు మొర్రోమని. పీకమీద గుచ్చేస్తున్న కత్తిని పారేసి ఛీ అని ఉమ్మేసి, ఆస్తి వ్యవహారాలు తేల్చుకొని, అన్ని బంధాలూ తెంచుకుని, ఈ బతుకు బతుకుతున్నాను. పేకాట... ఈ రోజు దొంగరాస్కెల్స్——' అని మళ్లీ ఏడ్చాడు. కుడిచేతితో తలమీద బలంగా తగిలిన గాయాన్ని వెతుక్కొని. 'ఇక్కడ దెబ్బ తగిలింది' అని చూపాడు.

పార్వతమ్మ రక్తం చూడలేదు. చూస్తే స్పృహ తప్పుతుందామెకి. పడిపోతుంది.

వెంటనే రోజా అమ్మని ప్రక్కకి కూర్చోబెట్టి, రక్తపుమచ్చ చూసి, కడిగి, గాయంమీద అయొడిన్, దూదిపెట్టి కట్టుకట్టింది. అక్కకి సహాయం చేస్తూ పక్కనే నిలబడ్డాడు కరుణ.

'ఊరుకో నాయనా, ఊరుకో. ఇంక ఏడవకు. పోయింది ఇంకా వస్తుందా? రాదు. మన నొసట ఎంతవుంటే అంత. ఇంకా నిండు జీవితం ఉంది. బ్రతకటానికి నూరేళ్లున్నాయి. చల్లగా బతుకుతావులే. తప్పుచేయని మనుషులెవరున్నారు చెప్పు? అంతా తప్పులు చేసేవాళ్లే. తప్పు తెలుసుకొని దిద్దుకున్నవాడే మహాత్ముడు. పద, పడుకో' అని చేయిపట్టి లేపింది.

రాఘవ లేచాడు.

గది, ఎక్కడి వస్తువులు అక్కడ అమర్చి అందంగా ఉంది. వెళ్లి పక్కమీద పడుకొన్నాడు. 'ఏ బెంగా వద్దు. చక్కగా నిద్రపో నాయినా. అంతా మన మంచికే' అని పార్వతమ్మ ఓదార్చి పక్కనే కూర్చుంది.

కాశీం కరుణ జన్మదినానికి పంపించిన మూడుకోతుల బొమ్మ ఎందుకో గుర్తు వచ్చింది రాఘవకి. గాంధీ మహాత్ముని వద్ద ఆ బొమ్మలు ఉండేవట! కళ్లు, చెవులు, నోరు మూసుకున్న మూడుకోతులు. అందంగా పాలరాతి బొమ్మలు. ఎక్కడి కాశీం? ఎక్కడి పార్వతమ్మ? కాశీంకీ తనకీ భేదమేవింటి? కాశీంకి తల్లిలేదు. తల్లి చెల్లెల్నే తండ్రి చేసుకొన్నాడు. కాని ఆమె తల్లి కాలేకపోయింది కాశీంకి. తనకీ అంతే

పార్వతమ్మ కళ్లు తెరచేసరికి —— పక్కగా.

పార్వతమ్మ రాఘవ తలకింద ఉన్న దుప్పటి మెల్లగా తీసి, గుండెవరకూ కప్పింది. దిండుమీద తల సుఖంగా పెట్టుకోటానికి వీలుగా లేదు. తలమీద గాయం.

'దొంగరాస్కెల్స్ నా కూడు తిన్నారు' అని పళ్లు కొరుకుతున్నాడు రాఘవ.

'రాఘవా నిద్రపో... నిద్రపో నాయినా. ఇంకేమీ తలంచుకోకు. తనకోపం తనశత్రువు నాయినా. మనిషిని అమాంతం కాల్చేస్తుంది. మన నిప్పు అని వొడిలో పోసుకుంటామా? పోసుకుంటే కాల్చేయడం మానేస్తుందా? వద్దుబాబూ, ఇంక వద్దు. మరచిపో.' పార్వతమ్మ గొంతు ఎంతో చల్లగా తాకుతున్నది రక్తసిక్తమైన తన మనసుని. తన గుండెల్లో సహస్ర సర్పాలు బుస కొట్టుతూ ఉంటే ఎవరో ఎక్కడో తీయగా పిల్లనగ్రోవి మోగిస్తున్నారు. తననెవ్వరో ముద్దుగా సాకుతున్నారు. తల్లినీ తండ్రినే కాదు, రక్కసి చేతులతో రక్తం పిండిన సంఘాన్ని కూడ మరిచిపోయాడు రాఘవ.

పెరుగన్నం ముద్దలు కుడుపుతూ ఉన్న కరుణ...

గాయం కడిగి కట్టు కట్టుతున్న రోజా...

పాలుతాగమని బలవంతంచేసే అమ్మ...
తిట్టినా నవ్వేసే శంకరయ్యగారు
కాశీం పంపిన మూడుకోతుల పాలరాతి బొమ్మలు...

* * *

వేకువజాము. పూలన్నీ మేలుకుంటున్నాయి. కరుణతో శంకరయ్యగారు మార్నింగ్‌వాక్‌కి వెళ్లిపోయారు. సముద్రపుహోరు సందడిగా ఉంది. రోజా చదువు కుంటున్నది తన టేబిల్ దగ్గర మౌనంగా. అంట్లు తోముతోన్న నూకాలమ్మ గాజుల చప్పుడు.

పార్వతమ్మ రాఘవ గదికి వచ్చింది. ఆమె నడక చప్పుడులో మొదటి మాటలు విన్పించలేదు స్పష్టంగా. కాని '... నిన్ను ...చంపుతారా'

కొంత నిశ్శబ్దం భయం భయంగా.

'నిన్ను చంపుతా. నీ రక్తం చూడకపోతే నన్ను' కలవరిస్తున్నాడు రాఘవ.

'రాఘవా' పిలిచింది ఆమె. వశం తప్పిన గొంతుతో పెద్దధ్వని ఛెళ్లున తట్టింది రాఘవని. రక్తమన్నమాట భయపెట్టింది ఆమెని.

'రాఘవా'

కదిలాడు.

'నాయనా, రాఘవా' మరింత గొంతుతో.

కళ్లు మెల్లగా తెరచి లోకాన్ని వెతుకుతూ ఉంటే
నిండు మాతృశోభతో మమత పరిమళాన్ని వర్షిస్తో —
ఆమె పాదాల పరిమళం —
'అమ్మా!'
తన ఫాలాన్ని ఆమె పాదాల చల్లందనంలో దాచుకున్నాడు రాఘవ.
'అమ్మా!'

* * *

'యువ' మాసపత్రిక
మే 65